# వైద్యో నారాయణో (హరిః)

"డాక్టరమ్మగారూ! మళ్ళీ కొత్తకేసొచ్చింది" స్ప్రింగ్ డోర్ తెరచుకొని వార్డుబోయ్ వచ్చి చెప్పాడు.

ప్రస్తుతానికి బెడ్లు ఖాళీల్లేవు-ఎవరైనా డిశ్చార్జి అయ్యే వాళ్ళున్నారేమో చూడు! అంతవరకూ ఆ పేషెంటుని వరండాలో బల్ల మీదే ఉండనీయి." డాక్టర్ సుభద్ర నిర్లక్ష్యంగా అంది.

వార్డుబోయ్ నేరుగా పేషెంటు దగ్గరికొచ్చాడు.

పేషెంటు పదేళ్ళ కుర్రాడు. విరేచనాలు, వాంతులు చేసుకుంటున్న కారణంగా పిల్లాడు బాగా డీలాపడ్డట్టు కనిపిస్తున్నాడు. కళ్ళుపీక్కుపోయాయి.

బెంచీమీద వెల్లకిలా పడుకుని ఉన్న పేషెంటు తలవైపు అతని తల్లి, కాళ్ళకు దగ్గరగా తండ్రి నిల్చుని ఆదుర్దాగా పిల్లవాడి ముఖంలోకి చూస్తూన్నారు.

అనుకోకుండా మరోసారి వాంతిచేసుకున్నాడు కుర్రాడు.

"అడ్డమైన తిళ్ళూ తింటారు. ఇక్కడికొచ్చి ఆపసోపాలు పడటమే కాకుండా ఆస్పత్రంతా ఖరాబు చేస్తారు.... ఇదేం మీసొంత ఇల్లనుకున్నారా ..." పిల్లవాని తల్లిదండ్రులవేపు అసహ్యంగా చూచి విసుక్కున్నాడు వార్డుబోయ్.

"పిల్లగాడి ప్రాణాలు కళ్ళల్లో ఉన్నయ్... డాక్టరమ్మ గారితో చెప్పి మందో మాకో ఇప్పించాల్సిందిపోయి కసురుకుంటావేం, బాబూ" అంటున్న పిల్లవాడి తండ్రి మాటల్లో కొడుకు భవిష్యత్తుపట్ల ఆవేదన.... ఏమవుతుందోనని ఆందోళన ప్రస్ఫుటించినాయి.

చేతిసంచిలోనుంచి పాతగుడ్డతీసి పిల్లవాడినోరు తుడిచింది తల్లి.

"అబ్బాయికి సూపుగూడా మందగిస్తున్నట్టుంది. వల్లు గూడా సల్లంగ ఉంది. నువ్వెల్లి డాక్టరమ్మ కాళ్ళమీద పడవయ్యా. దేవుడా." భర్తను కసిరింది.

సుభద్ర గదివేపు పరుగులాంటి నడకతో వెళ్ళాడు ముసలాడు.

"ఎక్కడికా పరుగు? ముందో అయిదు ఇటు పడేయ్—

లేకుంటే లోపలికెళ్ళేందుకు వీల్లేదు.'' యముడిలా అడ్డుపడ్డాడు వార్డుబోయ్.

"దరమాసు పత్రిలో డబ్బులేంది. బాబూ! పిల్లాడు సావు బతుకుల్లో ఉండాడు. నేనే అమ్మగార్ని అడుక్కుంటాను పోనియ్యి.'' బ్రతిమాలాడు ముసలాడు.

"ముస్టి అయిదు రూపాయలు ఆడి మొగాన కొట్టవయ్యా.. నీవు మాటలు పెట్టుకుని ఆలస్యం సేత్తే అబ్బాయి మనకు దక్కేట్లు లేదు.'' దూరం నుంచే కేకేసి చెప్పింది అలివేలు.

బనీను జేబులోంచి రెండు రూపాయల నోటు తీసిన నరసయ్య వార్డుబోయ్ చేతిలో ఉంచాడు.

"తస్సదియ్యా! రెండు రూపాయలిచ్చే సరికి... పిల్లాడి కంటే ముందునీ ప్రాణమే పోయినట్టుందే? ఇంతోటి దరిద్రుడివి డాక్టరమ్మకి ఫీజేమిచ్చుకుంటావ్!'' నోటు పై జేబులో పెట్టుకుని కసిరాడు వార్డుబోయ్.

వార్డుబోయ్ మాటలు వినిపించుకోకుండా బాణంలా దూసుకెళ్ళి సుభద్ర కాళ్ళమీద పడ్డాడు నరసయ్య.

"సచ్చి నీ కడుపున పుడతా తల్లీ, నా చరమం వొలిచి నీకు చెప్పులు కుట్టిత్తా, నా బిడ్డను నాకు దక్కించు...'' బావురుమన్నాడు.

'ఊళ్ళో కలరా కాదుగానీ, మధ్య నా ప్రాణాని కొచ్చింది. నిమిషానికో కేసు. సంపాదన మాట ఎట్లా ఉన్నా, ట్రీట్ చెయ్యలేక చావుకొస్తోంది'' అనేసి గొణుక్కుందిసుభద్ర.

"చుట్టు పక్కల ఉన్న డర్టీ విలేజస్ అన్నింటికి ఇదొక్కటే ఆస్పత్రి...పైగా ఈ సీజన్లో అన్నీ ఇలాంటి కేసులే. పల్లెటూరు కావడంవల్ల అర్ధరాత్రయినా సరే, ఇంటికొచ్చి లేవదీస్తారు." ఎదురుగాఉన్న కుర్చీలో కూర్చుని పేపరుచదువుతున్న సర్పంచ్ సీతయ్యతో అంది సుభద్ర.

సుభద్రకి పెళ్ళయిందని ఆమెను చూస్తే తెలుస్తుంది. కానీ, భర్త ఉన్నాడో లేదో ఎవరికీ అర్థంకాని విషయం.

ఆ ఊరొచ్చి రెండేళ్ళయినా.... మరో మగమనిషెవ్వరూ ఆమె ఇంటికివచ్చినట్టు ఆ ఊరి వాళ్ళెవరూ చూడలేదు.

డబ్బు ఆశలేని మనిషేమీ కాదు సుభద్ర. ఇవ్వగలవాళ్ళనుకుంటే ... పరిస్థితి గమనించి బాగానే గుంజుతుంది. లేనివాళ్ళు కాళ్ళావేళ్ళాపడితే ఒకనిట్టూర్పు విడిచి సరిపెట్టుకునే స్వభావం.

గదిలోంచి బయటికొచ్చి బెంచీమీదున్న పిల్లవాడి దగ్గరికొచ్చింది సుభద్ర.

పేషెంటు కళ్ళుమూసుకుని ఉన్నాడు. కను రెప్పలు విప్పార్చి పరీక్షగా చూసింది.

చొక్కా పైకితీసి పొట్టమీద చర్మాన్ని చేత్తో రబ్బరు లాగా సాగదీసింది.

"ఇప్పటికెన్ని వాంతులైనాయి?"

"రేతిరి మూడు... తెల్లారిరెండు ... ఈడకొచ్చినాక ఒకటి... వినయంగా అంది అలివేలు.

"ఇరోసినాలుకూడా అయ్యాయమ్మా... సెప్పవేమే, సన్నాసిముండా....'' పెళ్ళాంమీద విరుచుకుపడ్డాడు నరసయ్య.

ప్రాణం మీదికొచ్చేదాక నోరుమూసుకు కూర్చోక పోతే... రాత్రే తీసుకొచ్చి ఇక్కడపడేస్తే మీ తాతగాడి ముల్లేం పోయిందీ!....'' విసుక్కుంది సుభద్ర.

"తగ్గిపోద్దిలే అనుకున్నాం తల్లీ ..." గొణిగింది అలివేలు.

"సరే... సరే... ఇదిగో, నవనీతం... నిన్న ఎడ్మిట్ అయిన కేసు డిశ్చార్జిచేసి... ఈ కుర్రాడిని తీసుకెళ్ళి వార్డులో పడుకోబెట్టు..'' నర్సును పిలిచి పని పురమాయించింది సుభద్ర.

* * *

ఆఊరు ఇటు పల్లెకాదు... అటు పట్నమూ కాదు.

గవర్నమెంటువారి ధర్మమా అని ఒక ఆస్పత్రి వెలిసినందుకు సంతోషించారు ఊళ్లో వారంతా!

కానీ... ఆ ఆస్పత్రి కట్టిన రెండేళ్ళ దాకా డాక్టర్లు రాలేదు! ... డాక్టరొచ్చాక మందులు సమృద్ధిగా రావటం ఆగిపోయినాయి.

అందుక్కారణం ... వచ్చిన మందులు కాంపౌండరు, నర్సు, స్టోర్ కీపరూ కలిసి పక్కఊరికి తీసుకెళ్ళి మందుల షాపులో అమ్ముకుంటూరన్న నిజం అందరికీ తెలిసిందే!

అదేమని ఎవరైనా పెద్దమనుషులు నిలదీసి అడిగితే...

ఇండెంటు పెడుతూనే ఉన్నాం! ... సప్లయి చేయటం లేదనే వాళ్ళ బుకాయింపూ ఊరువారికి తెలిసిన విషయమే.

ఎ. పి. సి. టాబ్లెట్స్ ... బి — కాంప్లెక్సు మాత్రలు తప్పించి ఆస్పత్రిలో మరోటి ఉండదు.

పెన్సిలిన్ ఇంజక్షన్ తప్ప మరో సూదిమందు దొరకదు. అదీ నెలలో మొదటి పది రోజులే ఉంటుంది.

సివిలిజేషన్ పెరగని ఆ ఊరి ప్రజలకు ఆ ఆసుపత్రే ఒక పవిత్ర దేవాలయం!

రాక రాక వచ్చిన సుభద్రే ... ఆ ఊరి ప్రజల పాలిటి దేవత! !

* * *

విసుక్కుంటూనో ... కసురుకుంటూనో మొత్తానికి పిల్లవాడికి బెడ్ ఇచ్చారు.

బెడ్ ఇచ్చిన గంటసేపటికి ఒక సెలైన్ బాటిల్ తీసుకొచ్చి మంచం పక్కగా ఉన్న స్టాండుకి వేలాడదీశారు.

నీడిల్‌తో పిల్లవాడి ఒళ్ళంతా తూట్లు పడేట్లు పొడిచినా నరం దొరకలేదు.

"ఏంది, తల్లీ ... మందు మాకెట్లున్నా ... సూదితో పొడిచి పొడిచి పిల్లవాడి ఒళ్ళంతా హూనం చేసేత్తున్నావ్ ..." అని అలివేలు అనటంతో నర్సు గుర్రుగా చూచి మూతి విరుచుకుంది.

"హాస్పిటల్ అంతా కంపు కొడుతోంది. అసలే కలరా కేసులుకదా ... ప్రతి అరగంటకీ ఫినాయిల్‌తో శుభ్రపరచక పోతే ఎట్లా?" వార్డుబోయ్ మీద విరుచుకుపడ్డది సుభద్ర.

"ఫినాయిలు అయిపోయి రెండు రోజులైందండి! ..." వార్డుబోయ్ సమాధానంలో నిర్లక్ష్యం ఉట్టిపడ్డది.

ఊరి కరణానికి... మునసబుకి... సర్పంచ్‌గారికి మీరేగా పంచిపెట్టింది... అయిపోక ఇంకా ఉంటుందా! —అనే భావనని వార్డు బోయ్ చూపులద్వారా అర్థం చేసుకోగలిగింది సుభద్ర.

"శిలా పాపం... తలా పిడికెడూ! — కానీండి ఈ హాస్పిటల్ బాగుపడేది లేదు... పేషెంట్లు బ్రతికి బట్టకట్టేదీ లేదు..." అనేసి గొణుక్కుంటూ పేషెంటు బెడ్ దగ్గర కొచ్చింది సుభద్ర.

ఆగదిలో మొత్తం ఆరు బెడ్లు ఉన్నాయి. బెడ్లు చాలని కారణంగా... మరో నలుగురు పేషెంట్లు చాపలమీద పడుకుని ఉన్నారు.

అందరికీ కలిసి ఒక్కటే ఫాను. ఫాను గాలి ద్వారా వచ్చే ప్రాణవాయువునే అక్కడి పేషెంట్లు, వాళ్ళ తాలూకు పక్కనే ఉన్న మనుషులు పంచుకోవాలి!

అయిదు బెడ్ల పక్క సెలైన్ స్టాండ్లు ఉంటే .... చివరి ఆరో బెడ్ దగ్గర మాత్రం ఆక్సిజన్ స్టాండు ఉంది.

ఆక్సిజన్ స్టాండు పక్కనే ఉన్న బెడ్ మీద పేషెంటు

ఎగిరెగిరి పడుతున్నాడు. అతని ముక్కులోకి ఎక్కించిన రబ్బరు గొట్టం ప్రతిసారీ జారి పడిపోతూంది. హాస్పిటల్లో ప్లాస్టర్ కూడా లేదో ఏమో నర్సొచ్చి... పేషెంటు ముక్కులోకి దూర్చిన రబ్బరు గొట్టాన్ని జారి పడిపోకుండా పట్టుకుని వుండమంటూ పక్కనేవున్న పేషెంటు తాలూకు మనిషితో హెచ్చరించింది.

"సి...స్ట...ర్..." పొలికేక పెట్టింది సుభద్ర.

చివరి బెడ్ దగ్గరగా ఉన్న సిస్టర్ ఉలిక్కిపడ్డది సుభద్ర గావుకేకకి. ఒక్క అంగలో సుభద్ర దగ్గరకొచ్చి నిల్చుంది.

"ఈహాస్పిటల్లో మీ కెవ్వరికీ ఎలాంటి బాధ్యతా లేదు—నా ఒక్కదానికే పట్టింది. రెండో బెడ్ పేషెంటుకి ఎక్కిస్తోన్న బాటిల్లో సెలైన్ అయిపోయి అర్ధగంటయింది—నీకు కన్పించనే లేదు...నర్సుని కసిరింది సుభద్ర.

గబగబా స్టోర్సువైపు పరుగు తీసిన నర్సు మరో నిముషంలో వట్టిచేతులతో వెనక్కు తిరిగొచ్చింది.

"డాక్టర్! స్టోర్‌కీపర్ లంచ్‌కి వెళ్ళాడు. స్టోర్‌రూమ్ తాళంవేసి ఉంది..." రహస్యంగా చెప్పింది నర్సు డాక్టరుతో.

సుభద్రలో ఆదుర్దా...కోపం...అసహాయతా...ప్రవేశించాయి...మనిషి నీరసపడ్డది.

వెంటనే బెడ్‌దగ్గరికొచ్చి పేషెంట్ తాలూకు మనుషులకు ధైర్యం చెప్పింది.

* * *

బెడ్‌రూమ్‌లో పడుకుని ఏదో మెడికల్ జర్నల్ చదువు తుంటూాంది సుభద్ర.

రాత్రి పదకొండు గంటలు కావస్తూాంది.

దబదబా తలుపు తట్టిన శబ్దం విన్పించటంతో లేచివెళ్ళి తలుపుతీసింది.

"మీరా !— ఏమిటీ కంగారు?—" తలుపు తియ్యగానే వాకిట్లో ఎదురైన సర్పంచ్ సీతయ్యను చూస్తూ అడిగింది.

"మా పసివాడికి ఒకటే వాంతులు, విరోచనాలు... మీరు వెంటనే రావాలి..." చెమట పట్టిన ముఖాన్ని పై కండువాతో తుడుచుకుంటూ వచ్చాడు సీతయ్య.

"మీరు పిల్లవాడిని ఆస్పత్రికి పట్రండి— నేను బయలు దేరి వస్తున్నాను."

సీతయ్య వెళ్ళిపోయాడు.

సుభద్ర కూడా బయల్దేరింది.

కుర్చీలో కూర్చుని టేబులుమీద తలఆన్చి నిద్రపోతున్న నైట్ డ్యూటీ సిస్టర్ని చూచేసరికి ఒళ్ళు మండిపోయింది సుభద్రకి.

"నిద్రకి వేళా పాళా లేదూ? పన్నెండు గంటలైనా కాలేదు. అప్పుడే ఏమిటా మొద్దు నిద్ర..." అనేసి సుభద్ర కసిరేసరికి ఉలిక్కిపడి లేచింది నర్సు.

"సారీ, డాక్టర్ ...ఇప్పుడే కునుకుపట్టింది... ఇంత వేళ... ఏమిటిలా వచ్చారూ?..." డ్యూటీలో వున్న పోలీసు కానిస్టేబులు

ఎస్. ఐ. కన్పించగానే సెల్యూట్ చేసినట్టు ... ఎటెన్షన్లో నిల్చుని అన్నది నర్సు.

"సర్పంచ్ గారబ్బాయిని ఎడ్మిట్ చేసుకోవాలి! ఎమర్జన్సీ కేసు! బెడ్ ఖాళీ లేకపోతే, ఎవరినైనా డిశ్చార్జి చేసేయ్..."

నర్సు వార్డువేపు పరుగుతీసింది.

అక్కడున్న ఆరు బెడ్లలో మొదటి మంచం మీద మాత్రం డన్ లప్ పరుపు...మిగతా అయిదూ దూదిపరుపులు.

ఆక్సిజన్ స్టాండ్ దగ్గరగా వున్న బెడ్ మీద పేషెంటు ఎట్లాగూ హరీ అనేవాడే గదా అనేసి...బెడ్ మీదున్న మనిషిని చాప మీదకి మార్పించటం జరిగింది.

మొదటి బెడ్ మీదున్న పేషెంటుని అక్కడికి మార్పించి, డన్ లప్ బెడ్ వున్న మొదటి మంచం సర్పంచ్ సీతయ్యగారి పిల్లవాడికిచ్చారు.

ముందు సర్పంచ్ సీతయ్య...వెనకనే పిల్లవాడిని భుజాన వేసుకుని పాలేరు వచ్చేశారు.

సుభద్ర వాకిట్లోనే ఎదురై స్వాగతం పలికింది.

పాలేరు భుజాన వున్న పిల్లాడు ఆపసోపాలు పడుతున్నాడు.

బెడ్ మీద పడుకోబెట్టించి, పిల్లవాడిని పరీక్షిస్తోంది సుభద్ర. తానే స్వయంగా ఇంజక్షన్ కూడా ఇచ్చింది.

"మరేంకంగారు లేదు. అబ్బాయి తెలివిలోనే వున్నాడు.

అయినా ఫ్లూయిడ్సు అవసరమే..." అనేసి కావలసిన ఏర్పాట్లు చెయ్యమని చెప్పింది నర్సుతో.

నర్సు కదలకుండానిల్చుని బిత్తరచూపులు చూస్తూంది.

"ఏమిటా ఆలస్యం ? — వెంటనే వెళ్ళి పట్టుకురా" తొందరపెట్టింది సుభద్ర.

అసలు విషయం అందరి ఎదుటా చెబితే బాగుండదు... డాక్టర్ని పక్కకు పిలుచుకెళ్ళి రహస్యంగా ఏదో చెవిలో చెప్పింది నర్సు.

"వాట్ ఎ పిటీ!!! — ఫ్లూయిడ్స్ స్టాకులేదా ? ఇప్పుడెట్లా? మామూలు మనుష్యులైతే ఫర్వాలేదు కానీ... సర్పంచ్‌గారి అబ్బాయి విషయంలో ఆలస్యం చేస్తే...? ఇప్పుడేమిటి చెయ్యాలి..." అని మథనపడసాగింది సుభద్ర.

మెరుపులాంటి ఆలోచన మస్తిష్కంలో మెరిసింది.

గదిలోకొచ్చింది.

నరసయ్య పిల్లవాడి మంచం పక్కనే నిండుసీసా స్టాండుకి వ్రేలాడటం చూచింది సుభద్ర.

"పిల్లాడు తేరుకున్నట్టున్నాడు. ఇక అక్కర్లేదు ... అప్పుడప్పుడు గ్లూకోజునీళ్ళు గొంతులోపొయ్యండి చాలు..." అంటూ సిస్టరుతో చెప్పి ఆ స్టాండుకున్న సీసాను మార్పించి సీతయ్యగారి అబ్బాయికి ఎక్కించే ఏర్పాటు చేసింది సుభద్ర

"ఎంత గొప్పింటోళ్ళ పిల్లాడైతే మాత్రం ఇంత దారుణమా...మనం బీదోళ్ళమనేగా ఇంతచులకన? ..." పక్కనే ఉన్న భర్తతో చెప్పుకొని వాపోయింది అలివేలు.

“నోరు ముయ్యవే, ఎర్రి మొగవాఁ! సర్పంచిగోరు డాట్రమ్మకి దగ్గిరోడు... మన పిల్లాడు సచ్చినా ఫర్లేదు ... ఆయనగోరి అబ్బాయి మాత్రం బతకాల... కూటికి గతిలేని వాళ్ళ బిడ్డ బతికితేనేం, సత్తేనేం ?” నరసయ్య మాటల్లో భావం అలివేలుకి బోధపడలేదు,

“డాట్రమ్మని సర్పంచిగోరు దగ్గరకు తీసిండే...అందుకే ఆయనగారి అబ్బాయిమీద అంత శ్రద్ధ...” అలివేలు చెవిలో చెప్పాడు నరసయ్య.

“దేవుడా ... నా బిడ్డని నువ్వే కాపాడాలి ... అంటూ దేవుడికి మనస్సులోనే దణ్ణం పెట్టుకుంది అలివేలు.

—(18—1—78 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితము)

★


*With the best compliments*

*from*

**A. K. Krishnam Raj & Sons**

*Manufacturers of French Polish*

*and*

*Whole Sale dealers of Denature Spirits*

**BAZAAR STREET : CHITTOOR.**